క్లుప్తంగా

అశ్వత్థంలో ఎమ్మెల్యే సతీమణి పూజలు



అశ్వత్థ నారాయణుడిని దర్శించుకుంటున్న కేతిరెడ్డి రమాదేవి

యాడికి: పెద్దపప్పూరు మండలం చిన్న పప్పూరు సమీపాన వెలసిన అశ్వత్థం క్షేత్రంలో శనివారం తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సతీమణి కేతిరెడ్డి రమాదేవి అశ్వర్థ నారాయణుడు, శ్రీ చక్ర భీమ లింగేశ్వర స్వామి దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆమె స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆమెను శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

'అండగా ఉంటాం'



బాబుకు ఆర్థిక సాయం అందిస్తున్న కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి

యాడికి: అధైర్య పడొద్దు అండగా ఉంటామని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు, యువ నేత కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి బాధితుడికి భరోసా కల్పించారు. రాప్తాడు సిద్ధం బహిరంగ సభలో ప్రమాదవశాత్తు బారికేడ్‌ల వద్ద జరిగిన ప్రమాదంలో దైవాలమడుగు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త బాబుకు కాలు విరిగి అనంతపురంలో చికిత్స పొందుతున్నాడు. శనివారం సాయిప్రతాప్‌రెడ్డి అనంతపురంలో బాబును పరామర్శించాడు. వైద్య ఖర్చుల కోసం రూ.30 వేలు అందజేశాడు. వైఎస్సార్‌సీపీ నాయకుడు మోపిరెడ్డి ఉన్నాడు.

ప్రజల వద్దకే వైద్య సేవలు

యాడికి: ప్రజల వద్దకే వైద్యసేవలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి అన్నారు. శనివారం చందనలోని విలేజ్ క్లినిక్ వద్ద సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మండలంలో రెండు నూతన ప్రభుత్వ ఆసుపత్రులను నిర్మిస్తున్నారని, ప్రతి సచివాలయానికి విలేజ్ క్లినిక్ ఏర్పాటు చేసి 12 రకాల వైద్య సేవలు, 14 రకాల పరీక్షలు, 105 రకాల మందులతో ఆ సచివాలయ పరిధిలో ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఫరూక్, వెంకటరామిరెడ్డి, శివకేశవరెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్, హరీష్, జిలాన్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ఆ గ్రామాలకు నీటి ఎద్దడి రానీయొద్దు

అనంతపురం సిటీ: తాడిపత్రి, పెద్దపప్పూరు, యాడికి మండలాల్లోని 250 గ్రామాలకు తాగు నీటి ఎద్దడి రానీయొద్దని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి(సీఈఓ) వైఖోమ్ నిది యాదేవి ఆదేశించారు. తాడిపత్రి సమీపంలోని బాలప్పకోన వద్ద గల జేసీ నాగిరెడ్డి (జేసీఎన్ఆర్) తాగునీటి పథక విభాగాన్ని శనివారం రాత్రి 11 గంటలకు పరిశీలించారు. గండికోట రిజర్వాయర్ నుంచి జేసీఎన్ఆర్ సమగ్ర మంచి నీటి పథకం ద్వారా పైన పేర్కొన్న మూడు మండలాల్లోని గ్రామాలకు తాగునీటిని అందించే ఈ పథకం అమలులో అవాంతరాలు, అంతరాయాలు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ తాడిపత్రి సబ్ డివిజన్ డీఈ శ్రీరాములును ఆదేశించారు. పుట్లూరు, యల్లనూరు మండలాలకూ తాగు నీటిని సరఫరా చేసే పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి ఆదుకోవాలని సూచించారు.

ఇంజినీరింగ్ విద్యతో భవిష్యత్తు

తాడిపత్రిటౌన్: ఇంజినీరింగ్ విద్యతోనే విద్యార్థుల భవిష్యత్ బంగారు బాట అవుతుందని టెక్ కళాశాల సెక్రటరీ సురేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని టెక్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఫేర్‌వెల్ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత జనరేషన్ టెక్నికల్‌కు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాబోయే భవిష్యత్ అంతా ఇంజనీరింగ్ మీదే ఆధారపడి ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కరస్పాండెంట్ అశోక్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రత్యూష పాల్గొన్నారు.

కుర్ని నేసే కమ్యూనిటీ హాలుకు స్థలమివ్వండి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గుంతకల్లుటౌన్: కుర్ని నేసే దేవాచార సంఘం కమ్యూనిటీ హాలు, కులదైవమైన నీలకంఠేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయించాలని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడి ఆ సంఘం నాయకులు కోరారు. శనివారం ఎమ్మెల్యేను సంఘం పట్టణాధ్యక్షుడు అనపా బాలాజీ, కార్యదర్శి చంద్రశేఖర్, కులపెద్దలు ఆయన నివాసం వద్ద కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి వెంటనే ప్రతిపాదనలు పంపి స్థలం మంజూరు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి రాజశేఖర్, ప్రసాద్‌బాబు, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే జగనన్న లక్ష్యం

- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



అశ్వత్థంలో మహిళలకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



తాడిపత్రి సభలో థ్యాంక్యూ సీఎం సార్ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న మహిళలు

యాడికి: మహిళా సాధికారతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. శనివారం పెద్దపప్పూరు మండలంలోని అశ్వర్థ నారాయణ స్వామి క్షేత్రం వద్ద పొదుపు మహిళలకు వైఎస్సార్ ఆసరా వారోత్సవాలు నిర్వహించారు. ఎంపీపీ రామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. మొదట వారు దివంగత సీఎం వైఎస్సార్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సీఎం వైఎస్ జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళా సంక్షేమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మహిళలకు ఆర్థిక తోడ్పాటు అందించి వారి కుటుంబాలు సర్వతోముఖాభివృద్ధి సాధించేలా సీఎం కృషి చేస్తున్నారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పొదుపు మహిళల రుణాలను మాఫీ చేశారన్నారు. మరింత మేలు జరగాలంటే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని మళ్లీ గెలిపించాలన్నారు.

పేదల అభ్యున్నతిని ఓర్వలేని టీడీపీ..

పేదల అభ్యున్నతే ధ్యేయంగా వైఎస్ జగన్ పాలన సాగిస్తుంటే ప్రతిపక్ష టీడీపీ ఓర్వలేక బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఎమ్మెల్యే మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో వారికి మరోసారి గుణపాఠం చెప్పాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం మళ్లీ ఫ్యాన్‌గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని మహిళలను కోరారు. పెద్దపప్పూరు మండలంలోని 474 పొదుపు సంఘాల్లోని 4,741 మంది పొదుపు మహిళల ఖాతాల్లో ప్రభుత్వం నాలుగో విడత ఆసరా కింద రూ 3.29 కోట్లు జమ చేసిందని తెలిపారు. ఎంపీడీఓ కవిత, ఏపీఎం రామచంద్ర రాజు, సీసీ గంగయ్య, జెడ్పీటీసీ రమాదేవి, ఉపాధి హామీ స్టేట్ కౌన్సిల్ సభ్యుడు వేమనాథరెడ్డి, అశ్వర్థ ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసులురెడ్డి, మండల కన్వీనర్ అమర్‌నాథరెడ్డి, వైస్ ఎంపీపీ కళావతి, మాజీ ఎంపీపీ రామ్మూర్తి రెడ్డి, ఎంపీటీసీ అనిల్‌కుమార్ రెడ్డి, సర్పంచు రమేష్ నాయుడు, నాయకులు రఘునాథరెడ్డి, రామేశ్వరరెడ్డి, నాగిరెడ్డి, జనార్దన్ రెడ్డి, గంగన్న, అశోక్ రెడ్డి, ఓబుళరెడ్డి, శంకర్ రెడ్డి, యూత్ కన్వీనర్ కమలాకర్‌రెడ్డి, గార్లదిన్నె సర్పంచు హేమసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా పక్షపాతి జగన్

తాడిపత్రిటౌన్: సీఎం వైఎస్ జగన్ మహిళా పక్షపాతి అని, సంక్షేమ పథకాల్లో అక్కాచెల్లెమ్మలకే ప్రాధాన్యత కల్పించారని, ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. పట్టణంలోని వైకేపీ కార్యాలయ ఆవరణలో శనివారం ఆసరా వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తాడిపత్రి రూరల్‌లోని దాదాపు 8,316 మంది సభ్యులకు రూ.6.26 కోట్లు, అర్బన్‌లోని 8,596 మంది సభ్యులకు రూ.6.38 కోట్ల ఆసరా చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిళలతో కలిసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. సభ ఆసాంతం కొందరు మహిళలు థ్యాంక్యూ సీఎం సార్ ప్లకార్డులు ప్రదర్శించారు.

చంద్రబాబు భవిష్యత్‌కే గ్యారెంటీ లేదు

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు భవిష్యత్తుకే గ్యారెంటీ లేదని ఆయన ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ ఎలా ఇస్తారని ప్రశ్నించారు. జేసీ ప్రభాకర్‌రెడ్డికి వయస్సు మీద పడటంతో గొడవలు చేయలేక దొంగతనాలు చేసి కేసులు నమోదు చేయించుకున్నాడన్నారు. దొంగ లారీలు, దొంగ బస్సులు తెచ్చి కేసులు నమోదు చేయించుకొని పదవుల కోసం ఎదురుచూస్తున్నారన్నారని ఎద్దేవా చేశారు. తాడిపత్రి అభివృద్ధిని అడ్డుకుంటూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాడన్నారు. పట్టణంలోతాగునీరు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించకుండా తప్పించుకు తిరుగుతున్నాడన్నారు. తన సొంత ఖర్చుతో పలు దఫాలుగా డ్రైనేజీ సమస్యలు పరిష్కరించానని, వాటిని కూడా జేసీ ప్రభాకర్‌రెడ్డి అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నాడన్నారు. మరోసారి జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. మున్సిపల్ కమీషనర్ రవి, జెడ్పీటీసీ రమణమ్మ, ఈఓపీఆర్డీ జిలాన్‌బాషా, ఏపీఎం సునిత, తులసీ, ఏసీ రాజ్యలక్ష్మీ పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీ నెరవేర్చాం



కూతలేరు వంతెన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, సమన్వయకర్త వీరాంజనేయులు

- కూతలేరు వంతెనను ప్రారంభించిన ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, సమన్వయకర్త వీరాంజనేయులు

నార్పల: కూతలేరుపై రూ.2.5 కోట్లతో వంతెన నిర్మించడం ద్వారా ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చామని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులు పేర్కొన్నారు. శనివారం వారు మండల కేంద్రంలో పర్యటించారు. ఈసందర్భంగా వారికి పార్టీ శ్రేణుల నుంచి ఘన స్వాగతం లభించింది. అనంతరం ఎమ్మెల్యే వీరాంజనేయులు, నాయకులతో కలిసి కూతలేరు బ్రిడ్జి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో ఒకసారి, టీడీపీ హయాంలో రెండుసార్లు బ్రిడ్జి నిర్మాణం కోసం శంకుస్థాపన చేసి కనీసం పనులు కూడా మొదలు పెట్టలేదన్నారు. కానీ తాము ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం బ్రిడ్జి పనులు పూర్తి చేయించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల అభ్యున్నతే ధ్యేయంగా పని చేస్తోందన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందించడంతో పాటు రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి జగనన్న ఎంతో కృషి చేశారన్నారు. రాష్ట్రాభివృద్ధి, పేదలకు సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా జగనన్నను మరోసారి సీఎం చేసుకోవాల్సి ఉందన్నారు. అనంతరం కూతలేరు వంతెన నుంచి కొత్త బస్టాండ్ వరకు నిర్మించిన సైడ్ డ్రైన్‌ను ఆమె ప్రారంభించారు. రాష్ట్ర ఎంఎస్ఎంఈ డైరెక్టర్ నిట్టూరు రఘునాథ్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి ,కో ఆప్షన్ మెంబర్ షాబీరా, ఎంపీటీసీలు శంకర్‌యాదవ్, రాజారెడ్డి, పద్మాకర్‌రెడ్డి, మొరుసు రమణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, కేశవరెడ్డి, బండి లలితాకళ్యాణి పాల్గొన్నారు.

కొండమ్మకు జెడ్పీ చైర్‌పర్సన్ పరామర్శ



కొండమ్మను పరామర్శిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

బుక్కరాయసముద్రం: స్థానిక గాంధీనగర్ కాలనీలో నివాసం ఉంటున్న వైఎస్సార్ సీపీ మహిళా నేత మనేరి కొండమ్మను జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ శనివారం పరామర్శించారు. గత కొద్ది రోజులుగా కొండమ్మ అనారోగ్యంతో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఆమె ఇంటికి వెళ్లి ఆరోగ్యం, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని గిరిజమ్మ భరోసా ఇచ్చారు.

వైఎస్సార్‌సీపీతోనే పేదల జీవితాల్లో వెలుగులు



వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి అర్బన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే పేదల జీవితాల్లో వెలుగులు నిండాయని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. శనివారం ఎమ్మెల్యే పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొనుదుల రమేష్‌రెడ్డితో కలిసి పట్టణంలోని జయనగర్‌కాలనీలో పర్యటించారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లికి ప్రజలను ఆప్యాయంగా పలకరించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలో వచ్చిన వెంటనే సీఎం వైఎస్.జగన్ పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వారి జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. ఇది పేదల ప్రభుత్వమని, వారి కోసం ఏం చేయడానికైనా సిద్ధంగా ఉందన్నారు. రాష్ట్రంలోని బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడుతున్న ఏకైక సీఎం వైఎస్.జగన్ అని అన్నారు. పేదల తలరాతలు మారాలంటే జగనన్నను మళ్లీ సీఎంగా ఎన్నుకోవాలన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటేసి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే వెంట నాయకులు కె.నరసింహారెడ్డి, మనోజ్, కల్లూరు శ్రీనివాసులు, కేశవరెడ్డి, బాబాఫక్రుద్దీన్, అయూబ్ తదితరులు పాల్గొన్నారు.







రథానికి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, వీరాంజనేయులు పల్లకీపై ఊరేగుతున్న కొండమీదరాయుడు



తిరునాల.. భక్తుల ఆనందహేల

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలో కొండమీదరాయుని తిరునాల శనివారం వైభవంగా జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలిరావడంతో మండల కేంద్రంలోని వీధులు కిటకిటలాడాయి. భక్తులు కొండమీదరాయుడిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పెద్దసంఖ్యలో తినుబండారాలు, గాజులు, బొమ్మలు తదితర అంగళ్లు వెలిశాయి. ఆయా అంగళ్లు కొనుగోలుదారులతో సందడిగా మారాయి.



గాజులు కొనుగోలు చేస్తున్న మహిళలు

తిరునాలలో భక్తుల సందడి, స్వామికి సమర్పించేందుకు గుమ్మడికాయ తీసుకెళ్తున్న భక్తుడు

క్రైం కార్నర్

ఎడ్లబండిని ఢీకొన్న లారీ: ఐదుగురికి గాయాలు

పెద్దవడుగూరు: క్రిష్టిపాడు సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి లారీ ఎడ్లబండిని ఢీకొన్న ఘటనలో ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాలు.. యాడికి మండలం పచ్చారుమేకలపల్లికి చెందిన రామాంజినేయులు, బాలరంగయ్య, రామకృష్ణ, రాజేశ్వరి, భువనేశ్వరి ఎడ్లబండిపై తొండపాడు జాతరకు బయలుదేరారు. క్రిష్టిపాడు సమీపంలో తాడిపత్రి వైపు నుంచి గుత్తి వైపు వస్తున్న లారి ఎడ్లబండిని వెనుక వైపు ఢీకొంది. ఘటనలో గాయపడిన ఐదుగురినీ స్థానికులు గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు

గుత్తి రూరల్: జక్కలచెరువు గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై శనివారం బైక్ ఢీకొని మనోహర్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. పెద్దవడుగూరు మండలం కదరగుట్టపల్లికి చెందిన మనోహర్ తొండపాడులో జరుగుతున్న రంగనాథుడి బ్రహ్మోత్సవాలకు కాలినడకన వస్తున్నాడు. అయితే జక్కలచెరువు శివారులో గుత్తి వైపునకు వెళ్తున్న బైక్ వెనుక వైపు నుంచి వేగంగా వచ్చి మనోహర్‌ను ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని గమనించిన స్థానికులు వెంటనే గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురం తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

గుత్తి రూరల్: టి.కొత్తపల్లిలో ఓ యువకుడు శనివారం ఆత్మహత్యకు యత్నించాడు. వివరాలు.. గ్రామానికి చెందిన శ్రీనివాసులు కుమారుడు జులాయిగా తిరుగుతుండేవాడు. ఈ క్రమంలో తండ్రి శ్రీనివాసులు శుక్రవారం రాత్రి తీవ్రంగా మందలించాడు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన వెంకటేష్ ఇంటి నుంచి బయటకు వచ్చేసాడు. కొత్తపేట గ్రామ శివారులో విషద్రావకం సేవించి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చాడు. వారు అక్కడికి వచ్చి అతడిని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు అనంతపురం తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్రిమిసంహారక మందు సేవించిన వ్యక్తి మృతి



యాడికి: మద్యం మత్తులో క్రిమిసంహారక మందు తాగి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. ఏఎస్ఐ వెంకటేష్, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు..రాఘవేంద్ర కాలనీలో నివాసం ఉంటున్న మల్లికార్జున(35)కు భార్య తులసి, ఇద్దరు పిల్లలు సంతానం. ఆటో డ్రైవర్‌గా పని చేసే అతడు ఇటీవల తాగుడుకు బానిసయ్యాడు. ఆటోకు సక్రమంగా పోకుండా జులాయిగా తిరిగేవాడు. మద్యం కోసం డబ్బు కావాలని ఇంటిలో కూడా గొడవ పడేవాడు. ఈక్రమంలో శుక్రవారం రాత్రి మద్యం మత్తులో పురుగు మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు అనంతపురం తరలించారు. ఆ తర్వాత కర్నూలుకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

పెద్దవడుగూరు : వీరేపల్లి సమీపంలోని జాతీయ రహదారిపై శనివారం ఆటో బోల్తాపడి ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు..యాడికి మండలం కేశవరాయునిపేటకు చెందిన ఆటోలో అదే గ్రామానికి చెందిన గంగమ్మ, రాముడు, అరుణ తొండపాడు తిరునాలకు బయలుదేరారు. వీరేపల్లి సమీపంలోని జాతీయ రహదారిపై ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ఘటనలో తీవ్రంగా గాయపడిన ముగ్గురినీ స్థానికులు గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదంపై పోలీసులు విచారణ చేపట్టారు.

చిన్నారిపై కుక్క దాడి

గుత్తి: కర్నూలు జిల్లా తుగ్గలి మండలం ఎర్రగుడికి చెందిన పుష్ప(8) అనే చిన్నారిపై శనివారం కుక్క దాడి చేసింది. దాడిలో చిన్నారి గాయపడింది. చిన్నారి పాఠశాలకు వెళుతున్న సమయంలో ఓ కుక్క వెంట పడి కరిచింది. కుక్క దాడిలో గాయపడిన చిన్నారిని ఆమె తండ్రి వెంకటేష్ గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించాడు.

బైక్ అదుపు తప్పి.. ఇద్దరు యువకులకు గాయాలు

గుత్తి రూరల్: ఎంగిలిబండ గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై శనివారం బైక్ అదుపు తప్పి బోల్తా పడి ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు.. నాగసముద్రం గ్రామానికి చెందిన కార్తీక్, గొందిపల్లి గ్రామానికి చెందిన విశాల్‌లు తొండపాడులో జరుగుతున్న తిరునాలకు వెళ్లి బైక్‌పై గుత్తికి బయలుదేరారు. అయితే ఎంగిలిబండ గ్రామ శివారులో పెట్రోల్ బంకు వద్ద వేగంగా వెళ్తున్న వారి ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో తీవ్రంగా ఇద్దరినీ అటుగా వెళ్తున్న కొందరు గమనించి ఆటోలో గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన అనంతపురం తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్పీడ్ బ్రేకర్‌ను తప్పించబోయి..

యాడికి: పెద్దపప్పూరు మండలం చీమలవాగుపల్లె రైల్వేగేట్ వద్ద గల స్పీడ్ బ్రేకర్‌ను తప్పించబోయిన ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. మహారాష్ట్ర రాష్ట్రానికి చెందిన మహదేవ్ బైక్‌పై గుత్తి నుంచి తాడిపత్రి వైపుకు బయలుదేరాడు. రైల్వేగేట్ వద్ద ఉన్న స్పీడ్ బ్రేకర్‌ను తప్పించబోయి ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. మహదేవ్‌కు ముఖం, తలకు గాయాలు కావటంతో స్థానికులు తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు అనంతపురం తీసుకెళ్లారు.

అప్పుల విషయమై మహిళపై దాడి

యల్లనూరు: తిమ్మంపల్లిలో అప్పుల విషయమై ఓ మహిళపై సమీప బంధువులు దాడి చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. అనిత భర్త ప్రేమ్‌నాథ్ అరటికాయల వ్యాపారం చేస్తూ అప్పులు చేశాడు. సదరు రైతుల వద్ద అప్పులు చేయడంతో రైతులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. ఎస్ఐ గిరిబాబు రైతులతో మాట్లాడారు. తమ కున్న భూములను అమ్మి వచ్చిన నగదును రైతులకు కట్టేయాలని అనిత నిర్ణయించుకుంది. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి బంధువైన ప్రతాప్ ఇంట్లో మాట్లాడటానికి అని వెళ్లి మాటమాట పెరిగి అనితను కిందకు నెట్టేసి దాడి చేశాడు. గాయపడిన ఆమెను తాడిపత్రి ఆసుపత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కపోలీసులు కేసు నమోదు చేశారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం



మల్లేశ్వరికి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

పామిడి: ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎంఆర్ఎఫ్) పేదలకు వరంగా మారిందని ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన గుంతకల్లులోని తన క్యాంపు కార్యాలయంలో పీ కొండాపురం గ్రామానికి చెందిన కిడ్నీ బాధితుడు శ్రీనివాసులు భార్య మల్లేశ్వరికి రూ.5 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె సీఎం వైఎస్ జగన్, ఎమ్మెల్యే వైవీఆర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ నేత సునీల్‌రెడ్డి, 1వ వార్డు ఇన్‌ఛార్జ్ మునగల రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కందారమ్మ అమ్మవారి విగ్రహప్రతిష్ఠ

గుంతకల్లు రూరల్: నాగసముద్రంలో కందారమ్మ విగ్రహ ప్రతిష్ఠను శనివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి అమ్మవారిని దర్శించుకొని ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామస్తులు ఆయనను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు.

కబడ్డీ పోటీల్లో తాడిపత్రి విద్యార్థుల ప్రతిభ



క్రీడాకారులను అభినందిస్తున్న సీఐ, ఎంఈఓ

తాడిపత్రి అర్బన్: ఇటీవల సత్తెనపల్లిలో నిర్వహించిన 33వ సబ్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ కబడ్డీ చాంపియన్ షిప్ పోటీల్లో తాడిపత్రిలోని సాయిచైతన్య పాఠశాలకు చెందిన విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచారు. బాలికల ముగ్గురు అమ్మాయిలు, బాలుర విభాగంలో ఒకరు ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎంపికైన క్రీడాకారులను రూరల్ అప్‌గ్రేడ్ సీఐ లక్ష్మీకాంత్‌రెడ్డి, ఎంఈఓ నాగరాజు శనివారం అభినందించారు.

శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే సహించం



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రైనీ డీఎస్పీ హేమంత్‌కుమార్

పెద్దవడుగూరు: మండలంలోని ఫ్యాక్షన్ గ్రామాల్లో శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే సహించబోమని ట్రైనీ డీఎస్పీ హేమంత్‌కుమార్, ఎస్ఐ శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో మండలంలోని రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవరైనా పాత కక్షలు మనస్సులో పెట్టుకొని ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏవైనా సమస్యలుంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. పాత కేసుల్లోని నేరస్తుల కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. కొత్త వ్యక్తులు ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి రథోత్సవం



రథంపై సుబ్రమణ్యేశ్వరస్వామి

గార్లదిన్నె: కోటంక గ్రామంలో కొండల్లో గుంటికింద సుబ్రహ్మణ్యేశ్వరస్వామి రథోత్సవం శనివారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. స్వామివారికి ఏకవార రుద్రాభిషేకం, సహస్రనామార్చన వంటి కార్యక్రమాలు ప్రధాన అర్చకుడు రామాచార్యులు నిర్వ హించారు. స్వామివారికి నివాస గ్రామమైన కోటంకలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వెండి విగ్రహాలను రంగు రంగుల విద్యుద్దీపాలు, పుష్పాలతో అలంకరించిన రథంలో ఉంచి గ్రామవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు భజన కీర్తనలు, మేళ తాళాలతో స్వామిని సన్నిధికి చేర్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి రథోత్సవాన్ని తిలకించారు.